Postal License No.VJ/220/2023-25

నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 24-31 డిసెంబర్ 2024 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 30 | పేజీలు : 4 | రూ. 5.00

కరుణామయుని జన్మదినమే క్రిస్మస్!

మానవ జాతి పాప విముక్తి కోసం దేవుడే మానవుడిగా అవతరించిన పర్వదినం క్రిస్మస్. ప్రపంచానికి ప్రేమ, శాంతి సందేశాన్ని అందించిన కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మించిన పుణ్యదినం, ఇది క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ క్రిస్మస్. భారతదేశంలోనే కాక ప్రపంచంలోని పలు దేశాలలో ఈ పండుగను ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న వేడుకగా జరుపుకొంటారు. ఏసుక్రీస్తు జన్మించి ఇప్పటికి రెండువేల సంవత్సరాలు దాటింది. అయినప్పటికీ ఈనాటికీ క్రైస్తవులు ఏసుక్రీస్తు ప్రబోధించిన సూత్రాలను స్మరించుకొంటూ, కరణ తత్వాన్ని మననం చేసుకొంటూ క్రిస్మస్ జరుపుకొం టారు. రోమన్ సామ్రాజ్యాన్ని అగస్టీస్ సీజర్ అనే చక్రవర్తి పరిపాలిస్తుంటాడు. ఆయన తన రాజ్యంలో ఎంత మంది ప్రజలు ఉన్నారో లెక్కించేందుకు వీలుగా ప్రజలందరిని ఎవరి స్వగ్రామాలక వాళ్ళు డిసెంబర్ 25 తేదీలోగా వెళ్లాలని ఆజ్ఞాపిస్తాడు. నజరేతు అనే పట్టణంలో మేరీ, జోసెఫ్ అనే వాళ్ళు నివసిస్తుంటారు. వీరిద్దరికి పెళ్లి కుదిరి ఉంటుంది. ఆ సమయంలో మేరీకి ఒకనాటి రాత్రి కలలో గాబ్రియల్ అనే దేవదూత కనపడి నీవు దేవుని అనుగ్రహం పొందావు, నీవు కన్యగా ఉండగానే గర్భం ధరిస్తావని, నీకు జన్మించే కుమారుడు దేవుని కుమారుడని, అతనికి ఏసు అని పేరు పెట్టమని చెప్పాడు. ఆ ప్రకారంగానే కన్యగానే మేరీ గర్భవతి అవుతుంది. ఇది తెలుసుకొన్న జోసెఫ్ ఆమెను పెండ్లాడరాదని అనుకొంటాడు. ఒక రోజు అతనికి కూడా కలలో దేవదూర కనపడి మేరీని విడవవద్దు. ఆమె భగవంతుని వరం వల్ల గర్భవతి అయ్యిందని, ఆమెకు పుట్టే కుమారుడు దైవానుగ్రహం కలవాడని, ప్రజలను పాపాల నుంచి రక్షిస్తాడని చెప్పి అంతర్ధానం అవుతాడు. నిజం తెలుసుకున్న జోసెఫ్ మేరీని ఆదరిస్తాడు. జోసెఫ్ తన స్వగ్రామమైన బెత్లేహేమ్‌కు వెళతారు. కానీ అక్కడ నివసించేందుకు వసతి లేక పశువుల పాకలో తలదాచుకుంటారు. ఆ రాత్రి మేరీ మగబిడ్డను ప్రసవిస్తుంది. ఆ బిడ్డను పొత్తిళ్లలో చుట్టి పశువుల తొట్టిలో పడుకోబెడుతుంది. ఆ రాత్రి ప్రక్కనున్న పొలాల్లో గొర్రెలను కాస్తున్న వారికి వెలుగు రేఖల మధ్య దేవదూత దర్శనమిచ్చి లోకరక్షకుడు పశువుల పాకలో ఉన్నాడని చెప్పి దేవుని స్తుతిస్తూ గీతాలు పాడి వెళ్ళిపోతాడు. గొర్రెల కాపరులు అక్కడకు వెళ్లి తాము చూసింది, విన్నది మేరీ, జోసెఫ్‌లకు చెప్తారు. డిసెంబర్ 24 తేదీ అర్ధరాత్రి ఏసుక్రీస్తు జన్మించినందున ఆ మరుసటి రోజును క్రిస్మస్ పండుగగా జరుపుకొంటారు. ఈ పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే క్రైస్తవులు తమ ఇళ్లను, చర్చ్‌లను అందంగా అలంకరిస్తారు. వెదురు బద్దలు, రంగు కాగితాలతో పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి వేలాడ దీస్తారు. క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేస్తారు. చిరుగంటలు, రంగు కాగితాలతో అందంగా ముస్తాబు చేస్తారు. పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో ఏసు ప్రభువును ఆరాధించే వారిని ఆయన ఎల్లవేళలా కాపాడుతాడని పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ చెబుతోంది.

వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలి

నాదెండ్ల మనోహర్, ఆహారం, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖల మంత్రి

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటే జరిగే మోసాలను సులువుగా అరికట్టవచ్చని ఆహారం, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.. తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కు చట్టంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులతోపాటు సౌకర్యాలు గురించి, అవగాహన తీసుకురావలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ చట్టంలో ప్రతి ఏడాది అనేక మార్పులు తీసుకుంటున్నామన్నారు. మారుతున్న పరిస్థితుల ధృష్ట్యా సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఈ చట్టం పై ప్రజల్లో అవగాహన లేదన్నారు. వినియోగదారులకు ఈ చట్టం పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. ఈ ఏడాది వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యం ఇతి వృత్తంగా తీసుకున్నారన్నారు. గ్రామ స్థాయి నుండి పట్టణాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో ఏదైనా వస్తువులు తయారు చేసినప్పుడు ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకునేవాళ్ళున్నారు. ఇప్పుడు అ పరిస్థితి లేదని, వినియోగదారుల చట్టాలను ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. ఇది ప్రతి ఒక్క వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఇబ్బందులను గుర్తించి వాట్సాప్ ద్వారా రైతుల వద్ద నుండి 22,80,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి వారికి 48 గంటల్లో నగదు వారి ఖాతాల్లో జమ అయ్యే విధంగా ఏర్పాటు చేశామన్నారు. కాని అనుకున్న దానికన్నా ముందుగానే రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే రూ. 5,300 కోట్లు జమ చేసామన్నారు. అదేవిధంగా దీపం-2 పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ పంపిణీ చేసినప్పుడు అనేక ఇబ్బందులు ఉన్నా, వినియోగదారులకు అనుకున్న సమయానికే 75,00,000 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గతం లో చిన్న చిన్న షాప్స్ లో మనకి ఎక్స్ఛేంజ్ ఆఫర్ ఉండేది కానీ అలా ఇప్పుడు లేదన్నారు. ప్రతి పౌరుడికి రక్షణ తో పాటు గౌరవం కూడా ఇవ్వాలన్నారు.. మన ప్రధాన హక్కులు మనం ఇపుడు మర్చిపోతున్నామన్నారు. ఈ చట్టం గురించి మనం లోతు గా ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. మహిళలకు చట్టంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనన్, బిఐఎస్ జేడి రమాకాంత్, సివిల్ సప్లైస్ అధికారులు ప్రసాద్, పాపారావు, లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ అస్తమయం

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధానిగా, ఆర్థిక మంత్రి గా దేశాన్ని కొత్తపుంతలు తొక్కించిన మన్మోహన్ సింగ్(92) గురువారం కన్నుమూసారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో ఆయన మృతి చెందినట్లు పేర్కొన్నారు. 1991నుంచి ఆయన నిరాటంకంగా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 1991లో పీవీ మంత్రి వర్గంలో ఆర్థిక మంత్రి గా ఆర్థికసంస్కరణలు దేశానికి రుచి చూపించి కుప్పకూలే పరిస్థితి లో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ను నిలబెట్టారు. ఆయన కు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అసలు ఆర్థిక సంస్కరణల కోసమే ఆర్థిక వేత్త మన్మోహన్ ను రాజకీయాలలోకి పీవీ తీసుకువచ్చారు. ఆయన తన ఆర్థిక శాస్త్ర పరిజ్ఞానంతో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టాడు .బంగారం తాకట్టు పెట్టే స్థాయి నుంచి ఆర్థిక వ్యవస్థ ను సుస్థిరం చేసారు. అలా రాజకీయాల్లోకి వచ్చిన మన్మోహన్ సింగ్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో మన్మోహన్ సింగ్ ను ప్రధాని పదవి వరించింది. రాజ్యసభ సభ్యుడిగానే 10 ఏళ్లు ప్రధానిగా ఆ పదవిలో ఉన్నారు. బెస్ట్ పార్లమెంటేరియన్ గా ప్రశంసలు పొందారు. 1932లో ఇప్పటి పాకిస్థాన్ లోని పంజాబ్ లో జన్మించారు. 1958లో కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో ఆర్థిక శాస్త్రం చదివి, 1962లో ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ లో డాక్టరేటు పొందారు. 1978-80మధ్య రిజర్వ్ బ్యాంక్ డైరెక్టర్ గా, 1982-85లో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ గా పనిచేసారు. ఆసియా అభివృద్ధి బ్యాంక్ గవర్నర్ గా కూడా పని చేశారు. కాంగ్రెస్ లో నెహ్రూ, ఇందిరాగాంధీ తరువాత అంతకాలం ప్రధానిగా చేసినది మన్మోహన్ సింగ్ మాత్రమే. ఆయన ఐదు పర్యాయాలు అసోం నుంచి, ఆ తర్వాత రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఒక్కసారి కూడా లోక్ సభ కు ఎన్నిక కాకపోవడం గమనార్హం. ఆయన ఈ 33ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక గౌరవ పదవులు నిర్వహించారు. ఈ నాటికీ భారత ఆర్థిక వ్యవస్థ చెదరకపోవడం ఆనాటి ఆయన ఉక్కు సంకల్పమే కారణం. ఇలాంటి రాజకీయ ఆర్థిక వేత్త భారత్ కు లభించడం, ఆయనను వెలికి తీసిన పీవీ లాంటి మేధావి ఉండడం భారతీయుల అదృష్టం గా భావించాలి. ఆయన నాటిన విత్తే నేటికీ భారత్ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పవచ్చు. ఆయన ఇటీవలే రాజ్యసభ సభ్యత్వం నుంచి పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనకు ఆర్థిక మంత్రి పదవి, ప్రధానమంత్రి పదవి అనుకోకుండా లభించినా ఆ పదవులకు గౌరవం తెచ్చారు. ప్రధాని పదవికి సోనియా గాంధీ విదేశీయురాలని ప్రతిపక్షాల నుంచి వచ్చిన విమర్శలతో ఆమె ఆ పదవికి మన్మోహన్ సింగ్ ను ఎంపిక చేసారు. యూపీఏ చైర్మన్ గా ఉన్న సోనియా గాంధీని కలసి ప్రధానిగా మన్మోహన్ సింగ్ నిర్ణయాలను నిర్ణయాలుతీసుకునేవారు. సోనియా చేతిలో కీలుబొమ్మ అనే అపప్రథ కూడా ఆయన ఎదుర్కొన్నారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి ప్రజల మన్నలను పొందారు. ఎంతైనా ఆర్థిక వేత్త, ఆర్థికమంత్రిగా ఆయన దేశంలో సరైన సమయంలో తీసుకువచ్చిన సంస్కరణలు మాత్రం ఆయనను చిరంజీవిని చేస్తాయి.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం తీరని లోటు అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, ప్రియంక గాంధీ తమ సంతాపం తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణదల పవన్ కళ్యాణ్ సంతాపం తెలియజేశారు.

ఏపీ ఫైబర్ నెట్ లో అక్రమాలపై ఉక్కుపాదం

- జీవీ రెడ్డి, ఛైర్మన్, ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్ సంస్థలో అవసరం లేకున్నా ఎక్కువ మంది ఉద్యోగులను గత ప్రభుత్వం నియమించిందని అలాంటి వారు 410 మందిని విధుల నుంచి తొలగిస్తున్నామని, ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లో ఉన్న ఫైబర్ నెట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ జీవీ రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు 5 ఏళ్లలో అవసరానికి మించి ఎక్కువ మంది ఉద్యోగులను ఏవిధమైన నియామక ఉత్తర్వులు, లేకుండా కనీసం విచారణ లేకుండానే వాట్సప్ మెసేజ్ పెడితే వారికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. తీసుకున్నవారు సంస్థ కోసం పనిచేస్తే పర్వాలేదు కాని వారు శాసనసభ్యుల ఇంట్లో వంట పనులు, పార్లమెంట్ సభ్యుల ఇంట్లో డ్రైవర్ల గా పనిచేస్తూ ఫైబర్ నెట్ నుంచి జీతాలు తీసుకుంటున్నారన్నారు.

పని ఏమో వారికి సిఫార్సుల లేఖలు ఇచ్చిన వారి ఇళ్లల్లో... జీతం ఏమో ఫైబర్ నెట్ కార్యాలయంలో తీసుకుంటున్నారన్నారు. వారికి కనీసం అపాయింట్ మెంట్ లెటర్స్ కూడా లేకుండా డైరెక్ట్ గా పేరోల్స్ లోకి తీసుకున్నారన్నారు. అందుకే అలా గుర్తించిన 410 మందిని తొలగిస్తున్నా మన్నారు. ఇంకనూ ఉద్యోగుల్లో అనర్హులు ఉంటె వారిని కూడా తొలగిస్తామన్నారు. సంస్థకు 70-75 శాతం మంది అవసరం లేకున్నా ఉద్యోగులను తీసుకున్నారన్నారు. చైర్మన్ బాధ్యతలు స్వీకరించాక ఏ నిర్ణయం తీసుకున్నా ప్రభుత్వ నిబంధనలు ప్రకారం తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగుల పట్ల నాకు ఏవిధమై వ్యతిరేకత లేదన్నారు. అపాయింట్ మెంట్ లెటర్స్ లేని వాళ్లను తక్షణమే తొలగిస్తున్నామన్నారు. అలాంటి వారి వల్ల నేడు సంస్థ నెలకు రూ. 4 కోట్లు చెల్లించాల్సి రావడంతోపాటు దివాలా అంచున ఉందన్నారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలయకుండా ఉందని, అలాంటి వారిని ఉపేక్షించకూడదన్నారు. మేము కక్షతో దురుద్దేశంతో ఉద్యోగులను తొలగించడం లేదన్నారు. గత ప్రభుత్వం ఎపీఎస్ఎఫ్ఎల్ కు రూ. 1200 కోట్లు అప్పులు చేయడం సహా బకాయిలు రూ. 900 పెట్టిందన్నారు. అక్రమంగా నియమితులైన ఈ ఉద్యోగులను తీయకపోతే మేము రోడ్డున పడతామన్నారు. తొలగించిన ఉద్యోగులు ఎక్కువ మాట్లాడినా, ఇబ్బందులకు గురిచేసినా ఇంతవరకూ తీసుకువెళ్లిన శాలరీలు రికవరీ పెట్టాల్సి వస్తుంది, కేసులు పెట్టాల్సి వస్తుందన్నారు. ఉద్యోగులను నియమించిన వారికీ లీగల్ నోటీసులు ఇచ్చి వివరణ కోరతామన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎండీ లెక్కలేని తనంగా వ్యవహరించారన్నారు.

ఇలా ఉద్యోగుల నియామకానికి అనుమతులు ఇచ్చిన వారికి లీగల్ నోటీసులు పంపిస్తామని, అవసరమైతే రికవరీ చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇష్టమొచ్చినట్లు రిక్రూట్ చేశారు... దాన్ని సరిచేయాల్సిన బాధ్యత మా పై ఉందన్నారు.. లేకపోతే మేము తప్పు చేసినవారమవుతామన్నారు. లాభాల్లో ఉన్న సంస్థ నష్టాల్లోకి వెళ్లింది.. రూ. 2,160 కోట్ల అప్పులకు వెళ్లతారా అని ప్రశ్నించారు?.. ప్రభుత్వ రంగ సంస్థను ఒక పద్దతి ప్రకారంగా నడపాలి అని అన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలంలో 108 మంది ఉద్యోగుల కి నెలకు రూ. 40 లక్షలు చెల్లించగా గత ప్రభుత్వం లో 1,360 మంది ఉద్యోగులకు నెలకు రూ. 4 కోట్లు చెల్లించారన్నారు. గతంలో జీతాలపై చేస్తున్న ఖర్చు 10 రెట్లు పెరిగిందన్నారు. ఈ 5 ఏళ్లలో ఫైబర్ నెట్ సేవలను పూర్తిగా నిర్వీర్యం చేసేశారన్నారు.. పెరగాల్సిన కనెక్షన్లు 10 లక్షల నుంచి సగానికి 5 లక్షలకు తగ్గి దివాళా అంచుకి సంస్థ ను తెచ్చారన్నారు. సంస్థలో జరిగిన అక్రమాలపై ఉక్కు పాదం మోపి, పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. ప్రభుత్వ కార్పొరేట్ ఆఫీసును ఒక పద్దతి అనేది లేకుండా గత ప్రభుత్వం సంస్థను నడిపిందని చైర్మన్ జి.వి.రెడ్డి అన్నారు.

10 వేల మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా ప్రణాళిక

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలోని గ్రామీణ మహిళలు ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధిని సాధించేలా సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్), బీసీ సంక్షేమ శాఖ సంయుక్తంగా జనవరి నుంచి సరికొత్త నైపుణ్య శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాయి. గ్రామీణ మహిళలు గార్మెంట్ రంగంలో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడమే కాకుండా, చిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేలా రూపకల్పన చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం అమలుపై మంగళవారం నాడు సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి చర్చించారు. జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా 10వేల మంది గ్రామీణ మహిళలను ఈ పథకంలో భాగస్వాములుగా ఎంపిక చేస్తారు. వారందరికీ 45 రోజులపాటు గార్మెంట్ రంగంలో మెళకువలు నేర్చుకునేలా ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి మహిళకు సీడాప్, బీసీ సంక్షేమ శాఖ సహకారంతో నాణ్యమైన జుకీ మెషిన్లు (Juki Machines) అందజేస్తారు. శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా, ఇతరులకు ఉపాధి కల్పించేలా ఆయా పరిశ్రమలతో అనుసంధానించేందుకు సెంచూరియన్ యూనివర్సిటీ పనిచేయనుంది. పరిశ్రమల నుంచి ఆర్డర్లు అందిన తర్వాత, మహిళలకు పీసువర్క్ ఆధారంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పరిశ్రమల సహకారంతో, మహిళలు గార్మెంట్ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు కావాల్సిన అన్ని వనరులు ఈ పథకం ద్వారా అందించబడతాయి. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున, సీడాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. శ్యామ్ ప్రసాద్, సీడాప్ స్టేట్ మిషన్ మేనేజర్ విజయ్ కుమార్, సెంచూరియన్ యూనివర్సిటీ నుంచి జేఎం రావు తదితరులు పాల్గొన్నారు.

సూరత్ నగరంలో సూయెజ్ వాటర్ ను డ్రింకింగ్ వాటర్ స్థాయికి శుద్ధి చేయడం అత్యంత అభినందనీయం...

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : గత కొద్ది రోజులుగా దేశంలోని వివిధ రాష్ట్రాలు పర్యటించి అక్కడి నగరాల పారిశుధ్య నిర్వహణకు అధికారులు ఎలాంటి విధానాలు అమలు చేస్తున్నారు అనే విషయాలు తెలుసుకోవడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మరియు ఆయన సభ్యుల బృందం వరుస పర్యటనలు చేస్తూ అధ్యయనం చేస్తున్న సంగతి తెలిసిందే.. ఇందులో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గుజరాత్ నగరంలోని సూరత్ మహానగరంలోపర్యటించారు.. అక్కడ పారిశుధ్య నిర్వహణకు అవలంభిస్తున్న విధి విధానాలను చూసిన స్వచ్ఛాంధ్ర సభ్యుల బృందం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.. ఒకప్పుడు పారిశుధ్య లేమితో మురికి కూపంలా ఉండటమే కాకుండా "ప్లేగు" వ్యాధి కూడా విస్తరించిన సూరత్ మహానగరం ఇప్పుడు పరిశుభ్రతలో దేశంలోనే ఒక అగ్రగామి నగరంగా రూపాంతరం చెందడానికి ముఖ్య కారణం రామచంద్రరావు అనే తెలుగు ఐఏఎస్ అధికారి సూరత్ మునిసిపల్ కమీషనర్ గా ఉండటమేనని పట్టాభి తెలిపారు..ఒక నగరం అపరిశుభ్రత నుంచి బయటపడి స్వచ్ఛమైన నగరంలా మారడానికి కృషి చేసిన రామచంద్రరావు తెలుగువారవడం చాలా సంతోషంగా ఉందని అది తెలుగు వారందరికీ గర్వ కారణం అని పట్టాభిరామ్ తెలిపారు..అలాగే తమ పర్యటనలో భాగంగా అనేక ఆసక్తికరమైన విషయాలు గమనించడం జరిగిందని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌తో పాటు లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కూడా సూరత్ నగరంలోచాలా అద్భుతంగా చేస్తున్నారని పట్టాభి తెలిపారు..దాదాపుగా 2,285 కిలోమీటర్ల సూయెజ్ పైప్ లైన్ నెట్వర్క్ ను ఏర్పాటు చేసుకుని 11 ఎస్టిపిల ద్వారా నగరంలో నుంచి వస్తున్నటువంటి దాదాపు 1076 MLD డ్రైనేజ్ వాటర్ మొత్తాన్ని ట్రీట్ చేస్తున్నారని దానిని మరలా రెండవ సారి టెరిషరీ ట్రీట్మెంట్ కూడా చేసి సూయేజ్ వాటర్ నీ డ్రింకింగ్ వాటర్ స్థాయికి మారుస్తున్నారని పట్టభిరామ్ తెలిపారు.. అలా నగరంలో నుంచి వస్తున్న డ్రెయినేజీ వాటర్ లో దాదాపు 30 శాతం అనగా 370 MLD వాటర్ నీ చుట్టు పక్కల ఉన్న టెక్స్ టైల్ పార్క్స్ కి, పరిశ్రమలకి సరఫరా చేస్తున్నారని పట్టాభి తెలిపారు..స్వయంగా ఈ ఎస్టిపి ప్లాంట్స్, టెరిషరీ ప్లాంట్స్ ద్వారా మురికి నీటిని శుద్ధి చేసే విదానాన్ని అంతా పర్యవేక్షించడం తో పాటు ఆ శుద్ధి చేసిన నీటిని నాతో పాటు మా కార్పొరేషన్ సభ్యుల బృందం తాగారని పట్టభిరామ్ తెలిపారు.. చూడగానే ముక్కు మూసుకుని పక్కకి వెళ్ళిపోయే మురుగునీటిని మార్చి తాగునీటి దశకు తీసుకురావడం నిజంగా గొప్ప విషయమైతే అదే వాటర్ నీ పరిశ్రమలకి కూడా సరఫరా చేసి ఇప్పటివరకూ సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ 600 కోట్లు ఆర్జించి ఈ విదానాన్ని ఆదాయ వనరుగా కూడా మార్చుకోవడం చాలా పెద్ద విషయమని పట్టభిరామ్ తెలిపారు..ఈ స్థాయి టెరిషరీ ప్లాంట్స్ నీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టాభిరామ్ తెలిపారు.. గతంలో సింగపూర్ లో సూయెజ్ వాటర్ ను ట్రీట్ చేసి డ్రింకింగ్ వాటర్ స్థాయికి మారుస్తున్న విషయం గురించి విన్నామని కానీ సూరత్ లో కళ్ళారా చూసామని ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ లో జనసాంద్రత ఎక్కువ కలిగిన తిరుపతి, రాజమండ్రి, విశాఖ పట్టణం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు లాంటి అనేక మహా నగరాల్లో పెద్ద ఎత్తున డ్రెయినేజీ ద్వారా వస్తున్న మురుగునీటిని అక్కడ ఉన్న ఎస్టిపీలను గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి సారధ్యంలో ఆధునీకరించి సూయేజ్ వాటర్ నీ డ్రింకింగ్ వాటర్ స్థాయికి మార్చి పరిశ్రమలకి తదితర అవసరాల వినియోగానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కృషి చేస్తుందని త్వరలోనే ఆ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తుందని స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ స్పష్టం చేశారు..

మహిళలను ఇంటికి పరిమితం చేయడం మారాలి..వారికి అవకాశాలు కల్పించాలి

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో సమీక్ష చేశారు. కో-వర్కింగ్ స్పేస్, వర్క్ ఫ్రం హోమ్‌తో మానవ వనరుల సమర్థ వినియోగం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి ట్రైనింగ్ ఇచ్చి అవకాశాలు కల్పించాలని... అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ క్రియేట్ చేయాలని సీఎం అన్నారు. చదువుకున్న మహిళలు గృహిణిలుగా మిగిలిపోకూడదు, వారికి అవకాశాలు కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు విస్తృతంగా అవకాశాలు లభిస్తాయన్నారు. మహిళలను ఇంటికి, ఇంటి పనికి పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. ఇప్పటికీ చదువుకున్న మహిళలు ఇళ్లల్లో ఉంటున్నారని... వారికి వర్క్ ఫ్రం హోమ్ అందుబాటులోకి తెస్తే ఆన్లైన్ విధానంలో పనిచేసి ఉపాధి పొందుతారని అభిప్రాయపడ్డారు. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉందని, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి అవకాశాలు కల్పిస్తే... ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ల ఏర్పాటులో 2025 డిసెంబర్ చివరినాటికి 1.50 లక్షల సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఒక్కో సీటుకు 50-60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని.. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభ

ప్రధానమంత్రి సూర్య ఘర్:ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ప్రధాని



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : దేశవ్యాప్తంగా 2026-27 వరకు అమలు చేస్తున్నప్రధానమంత్రి సూర్య ఘర్:ముఫ్త్ బిజిలీ యోజనను ప్రజలు పెద్దఎత్తున వినియోగించుకునేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. ఈమేరకు గురువారం ఢిల్లీ నుండి ఆయన దేశవ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణం, మినరల్ బ్లాకుల వేలం, ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన అమలుకు సంబంధించి ప్రగతి అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యంలో వాటాను పెంచడానికి మరియు నివాస గృహాలు వారి స్వంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సాధికారత కల్పించడానికి 29 ఫిబ్రవరి, 2024న ప్రధాన మంత్రి సూర్య ఘర్:ముఫ్త్ బిజిలీ యోజనను భారత ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఈ పథకాన్ని రూ.75,021 కోట్ల వ్యయంతో 2026-27 ఆర్థిక సంవత్సరం వరకు అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పథకాన్నిజాతీయ స్థాయిలో నేషనల్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ (ఎన్‌పిఐఎ) మరియు రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (ఎస్ఐఎలు) అమలు చేస్తాయని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీ (డిస్కమ్‌లు లేదా పవర్, ఎనర్జీ డిపార్ట్‌మెంట్లు సందర్భానుసారంగా) రాష్ట్రం, యుటి స్థాయిలో స్టేట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలు (ఎస్ఐఎ)గా ఉంటాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ పథకం కింద డిస్కమ్‌లు తమ సంబంధిత ప్రాంతాల్లో రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా నెట్ మీటర్ల లభ్యత సకాలంలో ఇన్‌స్టాలేషన్‌లను తనిఖీ చేయడం మరియు ప్రారంభించడం,వెండర్ రిజిస్ట్రేషన్ మరియు మేనేజ్‌మెంట్,సోలరైజింగ్ కోసం ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కన్వర్జెన్స్ వంటి అనేక సులభతరమైన అంశాలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈపథకంపై ప్రజల్లో అవగాహన కల్పించి పెద్దఎత్తున ఈపథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు.

ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ఎలా పనిచేస్తుందంటే?

2 కెడబ్ల్యు సామర్థ్యం గల సిస్టమ్‌లకు సోలార్ యూనిట్ ధరలో 60% మరియు 2 నుండి 3 కెడబ్ల్యు సామర్థ్యం మధ్య సిస్టమ్‌లకు అదనపు సిస్టమ్ ఖర్చులో 40% సబ్సిడీని అందిస్తుంది. సబ్సిడీని 3 కిలోవాట్ల సామర్థ్యానికి పరిమితం చేశారు. ప్రస్తుత బెంచ్‌మార్క్ ధరల ప్రకారం, దీని అర్థం 1 కెడబ్ల్యు సిస్టమ్‌కు రూ.30,000, 2 కెడబ్ల్యు సిస్టమ్‌లకు రూ. 60,000 మరియు 3 కెడబ్ల్యు లేదా అంతకంటే ఎక్కువ సిస్టమ్‌లకు రూ.78,000 సబ్సిడీ లభిస్తుంది.

సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎవరు అర్హులు?

దరఖాస్తుదారు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి., సోలార్ ప్యానెళ్లను అమర్చుకోవడానికి అనువైన పైకప్పు ఉన్న ఇంటిని కలిగి ఉండాలి., ఇంటికి చెల్లుబాటు అయ్యే విద్యుత్ కనెక్షన్ ఉండాలి., సౌర ఫలకాల కోసం గృహస్థులు మరే ఇతర సబ్సిడీని పొంది ఉండకూడదు.

పియం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కోసం ఎలా దరఖాస్తు చేయాలి?

ముందుగా, ఆసక్తిగల వినియోగదారు జాతీయ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. రాష్ట్రాన్ని మరియు విద్యుత్ పంపిణీ సంస్థను ఎంచుకోవడం ద్వారా ఇది జరగాలి. నేషనల్ పోర్టల్ తగిన సిస్టమ్ సైజులు, బెనిఫిట్స్ కాలిక్యులేటర్, వెండర్ రేటింగ్ మొదలైన సంబంధిత సమాచారాన్ని అందించడం ద్వారా గృహాలకు సహాయం చేస్తుంది. వినియోగదారులు తాము ఇన్‌స్టాల్ చేసుకోవాలనుకుంటున్న రూఫ్ టాప్ సోలార్ యూనిట్‌ను వెండర్‌ను ఎంచుకోవచ్చు. ఈ వీడియో సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ హైదరాబాదు నుండి వర్చువల్‌గా పాల్గొన్నారు. అమరావతి రాష్ట్ర సచివాలయం నుండి ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, టిఆర్‌అండ్బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే, ఆర్థికశాఖ కార్యదర్శి జానకి, గనులశాఖ కమీషనర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలి

-ప్రత్యేక ప్యాకేజీ రూపకల్పనకు కృషి చేస్తున్నాం

-హోటళ్ల యాజమానులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎన్‌టీఆర్ జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమంలో హోటళ్ల యాజమానులు కీలక భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. నగరంలోని వివిధ హోటళ్ల యజమానులతో సమావేశమయ్యారు. జిల్లాకు పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని అమలు చేసేలా ఆలోచన చేస్తున్నామని అన్నారు. జిల్లాలో కనక దుర్గమ్మ దేవాలయంతో పాటు భవానీ ద్వీపం, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లావంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలున్నాయని.. జిల్లాలోని పర్యాటక కేంద్రాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి మరింతమంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ప్రత్యేక ప్యాకేజీతో ట్యాక్సీ, వాహన యజమానులతో పాటు ఆతిథ్య రంగ అభివృద్ధికీ అవకాశముంటుందన్నారు. పర్యాటకరంగ అభివృద్ధితో ఉపాధి అవకాశాల సృష్టి జరుగుతుందన్నారు. ప్యాకేజీ రూపకల్పనకు భాగస్వామ్య పక్షాలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నామని.. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి ఆర్‌వీ స్వామి, వి.రాఘవేంద్ర,హోటల్ ఐలాపురం ప్రతినిధి రాజా, బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటనలో భద్రతా లోపం.. హోం మంత్రి అనిత సీరియస్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మన్యం పర్యటనలో భద్రతా లోపంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ మన్యం పర్యటన సందర్భంగా ఓ నకిలీ ఐపీఎస్ కలకలం రేపాడు. వై కేటగిరీ భద్రతలో ఉండే పవన్ చుట్టూ బలివాడ సూర్యప్రకాశ్ రావు అనే నకిలీ ఐపీఎస్ తిరిగాడు. ఐపీఎస్ యూనిఫాంలో ఉన్న ఆయనకు కొందరు పోలీసు అధికారులు సెల్యూట్ కొట్టి, ఫొటోలు కూడా దిగారు. డిప్యూటీ సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం కలకలం రేపింది. దీనిపై హోం మంత్రి అనిత ఫైర్ అయ్యారు. విచారణకు ఆదేశించారు. భద్రతా లోపంపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఐపీఎస్ యూనిఫాంలో వచ్చిన సూర్యప్రకాశ్ ను విజయనగరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 20న పార్వతీపురం మన్యంలో పవన్ పర్యటించారు. అయితే, నకిలీ ఐపీఎస్ వ్యవహారాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు.

తెలంగాణ ఉద్యమం సమయంలో మన్మోహన్ సింగ్ అందించిన సహకారం మరువలేనిది: కేసీఆర్

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ ఉద్యమం సమయం నుంచి రాష్ట్రం ఏర్పాటు వరకు మన్మోహన్ సింగ్ అందించిన సహకారాన్ని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. భారత్‌లో ఆర్థిక సంస్కరణల రూపకర్తగా మన్మోహన్ సింగ్ దేశానికి అద్భుతమైన సేవలు అందించారని ప్రశంసించారు. మన్మోహన్ సింగ్‌తో తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. తెలంగాణ కోసం తాము ఉద్యమించిన సమయంలో ప్రతి సందర్భంలోనూ ఆయన మనోధైర్యాన్ని నింపారని గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ఏర్పాటయిందన్నారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనిదన్నారు. తెలంగాణ సమాజానికి ఆయన అత్యంత ఆప్తుడు అన్నారు. ఆయనకు బీఆర్ఎస్ తరఫున ఘననివాళి అర్పిస్తున్నామన్నారు.

వైసీపీ హయాంలో టీటీడీకి చెందిన వందల కోట్లు దోచుకున్నారు: భానుప్రకాశ్ రెడ్డి

వైసీపీ హయాంలో గుడిని, గుడిలోని లింగాన్ని సైతం మింగేశారని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి మండిపడ్డారు. దీనికి తిరుమల పరకామణిలో జరిగిన చోరీ ఘటన నిదర్శనమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు పెద్దలు టీటీడీకి చెందిన వందల కోట్లు దోచుకున్నారని ఆన్నారు. తిరుమలలో జరిగిన దోపిడీపై విచారణ జరిపించాలని డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం దేవాలయాల వ్యవస్థను నాశనం చేసిందని విమర్శించారు. విగ్రహాలపై దాడి చేశారని మండిపడ్డారు. రథాలను సైతం తగలబెట్టిన ఘటనలు జరిగాయని చెప్పారు. టీటీడీ నిధులను దారి మళ్లించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. మన ఆలయాలను మనమే కాపాడుకోవాలని చెప్పారు. ఆలయాలకు చెందిన ఒక్క రూపాయి నిధులను కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించుకోకూడదని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని తెలిపారు. జనవరి 5న విజయవాడలో శంఖారావం కార్యక్రమం జరగనుందని... ఆ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణకు తీర్మానం చేస్తామని చెప్పారు.

ధర్నాలు ఎందుకు చేస్తున్నారని ప్రజలే జగన్‌ను నిలదీస్తున్నారు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలపై భారం మోపుతోందని వైసీపీ ధర్నాలు, ఆందోళనలు చేపడుతుండడం పట్ల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందించారు. చంద్రబాబు చేసిన అభివృద్ధిని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన జగన్ ధర్నాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ధర్నాలు ఎందుకు చేస్తున్నారని ప్రజలే జగన్ ను నిలదీస్తున్నారని వెల్లడించారు. ఆనాడు పరదాల మాటున నక్కి, ఇప్పుడొచ్చి ధర్నాలు చేస్తున్నారా? అని విమర్శించారు. టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. అధికారం దక్కలేదన్న అక్కసుతో జగన్ కొత్త నాటకాలకు తెరలేపాడని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి జగన్ రూ.1.29 లక్షల కోట్ల మేర నష్టం కలుగజేశాడని ప్రత్తిపాటి ఆరోపించారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేయడానికి ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపింది జగనే అని, జగన్ తన పాలనలో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని వివరించారు. విద్యుత్ చార్జీల పెంపు కూడా జగన్ అవినీతిలో భాగమేనని అన్నారు.

కొరడాతో కొట్టుకున్న బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై..

తమిళనాడు, నేటి పత్రిక ప్రజావార్త : తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కొరడాతో కొట్టుకున్నారు. ఇటీవల అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనపై డీఎంకే ప్రభుత్వ తీరుతీరును నిరసిస్తూ ఆయన ఇలా చేశారు. చొక్కా విప్పి కొరడాతో ఆరుసార్లు కొట్టుకున్నారు. శుక్రవారం ఉదయం తన నివాసం ముందు చేసిన ఈ వినూత్న నిరసన తాలూకు వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మరోవైపు డీఎంకేను గద్దె దించే వరకు తాను చెప్పులు వేసుకోనంటూ అన్నామలై గురువారం నాడు మీడియా సమావేశంలో శపథం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో అన్నామలై మాట్లాడుతూ.. రాష్ట్రంలో పిల్లలు, స్త్రీలకు భద్రత లేదన్నారు. యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి డీఎంకే వ్యక్తేనని ఆరోపించారు. అందుకే డీఎంకేను అధికారం నుంచి దించేవరకూ చెప్పులు కూడా వేసుకోనని శపథం చేశారు. అలాగే శుక్రవారం నుంచి 48 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తానన్నారు. తన ఇంటి ముందు ఆరు కొరడా దెబ్బలు కూడా కొట్టుకుంటానని పేర్కొన్నారు. చెప్పినట్టే ఇవాళ అన్నామలై కొరడాతో కొట్టుకున్నారు.

సంక్రాంతి తర్వాత ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళ్తా...

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని వైసీపీ శ్రేణులకు ఆ పార్టీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత తాను ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళుతున్నానని... అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు. మనం ఇంత త్వరగా ప్రజల్లోకి వెళ్లాల్సి వస్తుందని తాను అనుకోలేదని తెలిపారు. చంద్రబాబు పాలన బాదుడే బాదుడులా ఉందని... సూపర్ సిక్స్ లేదు, సూపర్ సెవెన్ లేదని... అందుకే మనం పోరుబాట పట్టాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటికే రైతుల కోసం ధర్నా చేశామని... ఈ నెల 27న కరెంట్ బిల్లులపై మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. 2027లో జమిలి ఎన్నికలు అంటున్నారని... దీంతో నెలలు గడిచే కొద్దీ చంద్రబాబులో భయం పెరిగిపోతోందని జగన్ అన్నారు. మనం మాత్రం రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. దేశ చరిత్రలో ఎవరూ చేయని మంచి పనులను మన ప్రభుత్వ హయాంలో చేశామని అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కష్టాలు వచ్చినప్పుడు వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని చెప్పారు.

వాట్సాప్ పై నిషేధం దిశగా రష్యా!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : 2025 నూతన సంవత్సరంలో వాట్సాప్‌కు రష్యా షాక్ ఇచ్చే నిర్ణయాన్ని వెలువరించే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినబడుతున్నాయి. వాట్సాప్‌పై రష్యా నిషేధం విధించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విదేశీ యాప్‌లు తమ చట్టాలకు లోబడి ఉండకపోతే నిషేధం విధిస్తామని రష్యన్ అధికారులు హెచ్చరించారు. ఈ అంశంపై రష్యా సెనేటర్ ఆర్టియోమ్ షేకిన్, డుమా అధికారి ఒలేగ్ మాట్వేచెవ్ మాట్లాడారు. రష్యన్ నిబంధనలు పాటించాలా? లేక నిష్క్రమించాలా? అనేది వాట్సాప్ యాజమాన్యానికే వదిలివేసినట్లు వారు తెలిపారు. దేశంలోని భద్రతా సేవలతో యూజర్ సమాచారాన్ని ప్లాట్ ఫామ్ షేర్ చేసుకోకపోతే వచ్చే ఏడాది నుంచి వాట్సాప్‌ను బ్లాక్ చేయగలమని సెనేటర్ అర్టియోమ్ షేకిన్ రాష్ట్ర వార్త సంస్థ ఆర్ఐఏ నోవోస్టితో అన్నారు. ఇప్పటికే మెటా యాజమాన్యంలోని యాప్‌లు ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ లపై రష్యాలో నిషేధం కొనసాగుతోంది. 2022 నుంచే ఇవి రష్యాలో నిషేధించబడ్డాయి.

పెండింగ్ బిల్లుల గురించి అడిగిన వైసీపీ నేతలు, కాంట్రాక్టర్లపై జగన్ అసహనం

పులివెందుల, నేటి పత్రిక ప్రజావార్త : వైసీపీ అధినేత జగన్ నిన్న పులివెందులలో ప్రజాదర్బార్ నిర్వహించిన సంగతి తెలిసిందే. జగన్ ని కలిసేందుకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా అక్కడ ఊహించని పరిణామం చోటు చేసుకుంది. వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదంటూ కొందరు వైసీపీ నేతలు, కాంట్రాక్టర్లు అక్కడ రచ్చ చేశారు. జగన్ ను కలిసేందుకు క్యాంపు కార్యాలయంలోకి దూసుకుపోయే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కార్యాలయం ద్వారం వద్ద తోపులాట జరిగింది. ద్వారం పక్కనున్న అద్దం పగిలిపోయింది. అద్దం ముక్కలు గుచ్చుకుని కొందరికి గాయాలయ్యాయి. తోపులాటను అదుపు చేయడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ క్రమంలో వైసీపీ నేతలు, కాంట్రాక్టర్లతో జగన్ మాట్లాడుతూ 'ఇప్పుడు కూడా బిల్లులు అడుగు తున్నారేందన్నా... ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే ఎలా అన్నా?' అని అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు బిల్లులు ఇప్పటికీ పెండింగ్ లోనే ఉన్నాయి. దీంతో, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే పనులు చేసిన కొందరు వైసీపీ నేతలు, కాంట్రాక్టర్లు బిల్లులపై జగన్ ను ప్రశ్నించే ప్రయత్నం చేశారు.

ట్రూఅప్ చార్జీల కర్త, కర్మ, క్రియ అన్నీ జగనే: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతూ, అధిక బిల్లులతో ప్రజల నెత్తిన భారం మోపుతోందని వైసీపీ నిరసనలు చేపడుతుండడం తెలిసిందే. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. రాష్ట్రంలో కరెంటు ట్రూఅప్ చార్జీల కర్త, కర్మ, క్రియ అన్నీ జగనే అని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెరుగుదలకే జగనే కారణమని స్పష్టం చేశారు. జగన్ గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నాడు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపి నేడు ధర్నాలు, ర్యాలీలు చేయడం సిగ్గుచేటని అచ్చెన్నాయుడు విమర్శించారు. యూనిట్ విద్యుత్ రూ.5కే వస్తున్నా జగన్ కొనలేదని, కమీషన్లకు కక్కుర్తిపడి యూనిట్ విద్యుత్ రూ.8కి కొన్నారని వివరించారు. జగన్ చేసిన పాపాలు నేడు శాపాలుగా మారాయని అన్నారు.

నా వల్ల తప్పు జరిగితే హెూంగార్డుకైనా సారీ చెబుతా: సీవీ ఆనంద్

హైదరాబాద్ , నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇటీవల జాతీయ మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటనకు నేషనల్ మీడియా సంస్థలు మద్దతి స్తున్నట్టుగా ఉందని ఆయన అసహనం వెలిబుచ్చారు. అయితే తన వ్యాఖ్యల పట్ల సర్వత్రా విమర్శలు రావడంతో ఆయన క్షమాపణ చెప్పారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ... చేసిన తప్పును అంగీకరించడం గొప్ప విషయమని, అదే మిమ్మల్ని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టిందంటూ సీవీ ఆనంద్ ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. నరేశ్ అనే వ్యక్తి చేసిన ఆ ట్వీట్ ను సీవీ ఆనంద్ రీట్వీట్ చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఎప్పుడైనా నేను తప్పు చేశానని భావిస్తే నా హెూంగార్డుకైనా సరే క్షమాపణ చెప్పేందుకు వెనుకాడను. ఈ గుణం నాలో చిన్నప్పటి నుంచి ఉంది. బహుశా క్రికెట్ ఆడడం వల్ల వచ్చి ఉంటుంది. క్రికెట్ ఆడడం అనేది నన్ను మెరుగైన వ్యక్తిగా మలిచింది. నా అహాన్ని వదిలేయడం ద్వారా నేను అందరిలో ఒకడిగా ఉండాలనుకుంటాను. ఓ వ్యక్తిని పరిపూర్ణ మానవుడిగా మలిచేందుకు జట్టుగా ఆడే క్రీడలు చాలా ముఖ్యమని భావిస్తాను. కానీ కార్పొరేట్ తరహా విద్యా వ్యవస్థలో ఇటువంటి అవకాశం లేకుండా పోవడం దురదృష్టకరం" అని సీవీ ఆనంద్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

టీడీపీ, జనసేనలు కేంద్రానికి గులాంగిరి చేస్తున్నాయి: షర్మిల

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. 243 మంది పని చేసే కర్ణాటక స్టీల్ ప్లాంట్ కు పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి... 26 వేల మంది పని చేసే వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడానికి మాత్రం మనసు రావడం లేదని దుయ్యబట్టారు. ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీఎస్ రూ. 15 వేల కోట్ల నిధులు రాబట్టిందని... కేంద్రంలోని ఎన్డీయేకు ఊపిరి పోసిన టీడీపీ, జనసేన పార్టీలు మాత్రం కేంద్రానికి గులాంగిరి చేస్తున్నాయని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ఆదుకోవాలని కోరుతూ 1,400 రోజులుగా కార్మికులు ఉద్యమాలు చేస్తుంటే సీఎం చంద్రబాబు మాత్రం ప్రధానితో మిట్టల్ స్టీల్ గురించి చర్చిస్తున్నారని షర్మిల విమర్శించారు. మిట్టల్ పెట్టబోయే ప్లాంట్ కు ఇనుప ఖనిజం కొరత లేకుండా చూడాలని కోరుతున్నారని... ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను సెయిల్లో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కు న్యాయం జరగకపోతే ఎన్డీయే నుంచి టీడీపీ, జనసేన బయటకు రావాలని డిమాండ్ చేశారు.

జనవరి 8న ఏపీకి ప్రధాని మోదీ

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏపీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. జనవరి 8న ఆయన ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. విశాఖ రైల్వే జోన్‌తో పాటు దాదాపు రూ.85 వేల కోట్ల విలువైన అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీ, ఏపీ జెన్కో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ తదితర నిర్మాణాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వాస్తవానికి నవంబర్‌లోనే ప్రధాని మోదీ వీటికి శంకుస్థాపన చేయాల్సి ఉంది. అందుకు షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. అయితే నాడు తుపాను రావడంతో మోదీ పర్యటన వాయిదా పడింది. ఆ తర్వాత నవంబర్ 29న ప్రధాని పర్యటన ఖరారు చేశారు. అయితే తుపాను కారణంగా రెండోసారి కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ ప్రధాని ఉత్తరాంధ్ర పర్యటన ఖరారైంది. జనవరి 8న ఆయన రాష్ట్రానికి రానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారిక కార్యక్రమాల్లో మోదీ పాల్గొనడం ఇదే తొలిసారి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ సన్నాహాలు చేస్తోంది. ఏర్పాట్లను మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఎంపీ సీఎం రమేశ్ పర్యవేక్షిస్తున్నారు. 8న జరగబోయే కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు.

వికసిత్ భారత్ -2047 దిశగా జిల్లాలో పశు సంవర్ధక శాఖ అభివృద్ధికి కృషి చేయాలి

తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త : జిల్లాలో పశు సంరక్షనే ధ్యేయంగా పశు సంపద సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకు పశు గణన ప్రక్రియను చేపట్టడం జరిగిందని, కావున వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులును ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు పశుసంవర్ధక శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు, ప్రాంతీయ పశు వైద్యశాలల సహాయ సంచాలకులతో జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ స

మొక్కలు నాటి ప్రకృతితో మమేకమవుదాం

- రాష్ట్ర బీసీ శాఖ మంత్రి సవిత

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : చెట్లు పెంచుతూ, సేంద్రీయ సాగు చేస్తూ ప్రకృతితో మమేకమవుదామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. చెట్ల పెంపకంతోనే ఆరోగ్యంతో కూడిన ఆయువు లభిస్తుందని వెల్లడించారు. నగరంలోని మొగల్రాజపురంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన ఏపీ ఫ్లవర్ షో ను మంత్రి సవిత మంగళవారం సందర్శించారు. ఫ్లవర్ షో ఏర్పాటు చేసిన 70 స్టాళ్లను మంత్రి తిలకించారు. ప్రతి స్టాల్ దగ్గరకెళ్లి మొక్కలు, వాటి రకాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను కూడా మంత్రి సందర్శించి, కొనుగోలు చేశారు. ఏయే ప్రాంతాల నుంచి వచ్చార, అమ్మకాలు ఏ మేర జరుగుతున్నాయా..? అని స్టాళ్ల యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పలు మొక్కలు, సేంద్రీయ ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. మొక్కలు కంటికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయన్నారు. విజయవాడలో వరుసగా అయిదు పర్యాయాలు ఫ్లవర్‌షోలు ఏర్పాటు చేసిన నిర్వాహకుడు గరిమెళ్ల జానకీరామ్‌ను అభినందించారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మొక్కలు పెంపకం ఎంతో అవసరమన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్‌తో ఉష్ణోగ్రతలు భూమి వేడెక్కుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. గత వేసవిలో నమోదైన ఉష్ణోగ్రతలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పచ్చని చెట్లతోనే పచ్చని జీవితాలు సాధ్యమవుతాయన్నారు. పురుగుల మందులు, ఎరువుల స్థానంలో సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్య మివ్వాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్య వంతమైన జీవనం లభిస్తుందన్నారు. వివిధ రకాల మొక్కల స్టాళ్లను గుంటూరు, భీమవరం, కాకినాడ, బాపట్ల, కడియంతో పాటు తమిళనాడు, తెలంగాణా, కర్నాటక, మహారాష్ట్రకు చెందిన వారు కూడా ఏర్పాటు చేశారన్నారు. నగర వాసులు ఫ్లవర్ షోను సందర్శించి మొక్కలు, సేంద్రీయ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అంతకుముందు ఫ్లవర్ షో సందర్శనకు వచ్చిన మంత్రి సవితకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలి...: తేజ్ భరత్ మెప్మా డైరెక్టర్

-లాంఛనంగా ప్రారంభమైన సంజా ఉత్సవ్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలని నినాదంతో సంజా ఉత్సవాన్ని నిర్వహించాము అన్నారు మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మ్యారీస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియం నందు సంజా ఉత్సవ్–ఎస్‌హెచ్‌జి మేళ 2024ను లాంఛనంగా మెప్మా డైరెక్టర్ తేజ భరత్ అడిషనల్ కమిషనర్ జనరల్ విజయవాడ నగరపాలక సంస్థ డాక్టర్ డి.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ నేషనల్ అర్బన్ లాగ్లీహుడ్ మిషన్ 2.0 లో భాగంగా, పేద మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రతి కుటుంబంలో ఒక వ్యాపార ఉండాలని ఉద్దేశంతో సంధ్య ఉత్సవ పేరుతో ఇటువంటి మేళ ఏర్పాటు చేశారని తెలిపారు. 28 లక్షల స్వయం సహాయక బృందాలు అందులో 11 లక్షల మంది జీవనోపాధి కార్యకలాపాలు చేస్తున్నారని, అందులో ఆరు లక్షల మంది వ్యాపారవేత్తలు ఉండగా, ఐదు లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. అక్కడ వచ్చిన వారందరికీ ప్రభుత్వ పథకాలైన స్వనిధి, విశ్వకర్మ యోజన, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఇండివిజువల్, సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ గ్రూప్, ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజ్, ప్రధానమంత్రి ముద్ర లోన్ల గురించి తెలిపారు. ప్రతి ఒక్కరూ నిరంతర ఆదాయం సంపాదించే విధంగా అడుగులు వేయాలని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్‌లో భాగంగా నేషనల్ లవ్లీ హుడ్ మిషన్ 2.0 స్కీం ద్వారా పేద మధ్యతరగతి వారికి ఆర్థిక అభివృద్ధి కల్పించాలని ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 26, 2024 నుండి డిసెంబర్ 30, 2024 వరకు జరిగే ఈ కార్యక్రమంలో స్వయం సహాయక బృందాలు 100కు పైగా స్టాల్స్‌లలో వారు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శన మరియు అమ్మకం చేస్తున్నారని, ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అన్ని వయసుల వారికి ఆకర్షించే విధంగా కిడ్స్ ప్లే, ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఉచిత ప్రవేశమైన ఈ మేళాలో అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి.వెంకట నారాయణ, టెక్నికల్ ఎక్స్పెస్ ఫణికుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశా జ్యోతి, పేదవాడి గుండె చప్పుడు స్వర్గీయ వంగవీటి రంగా 36వ వర్ధంతి

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఐక్య కాపునాడు ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా విజయవాడ, గాంధీనగర్, ప్రెస్ క్లబ్ నందు గురువారం కీ.శే. రంగా చిత్ర పటానికి సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వం విప్ బొండా ఉమా మహేశ్వరరావు ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు బేతు రామమోహనరావు, మేడా శ్రీనివాస్, లాము జైబాబు రంగా మిత్ర మండలి నాయకులు పెద్దలు పూలమాలలు వేసి ఘననివాళులర్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాపు నాడు అభ్యర్థన మేరకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని గత ప్రభుత్వంలో రంగా జిల్లా కోసం నిరాహార దీక్ష చేశామని అప్పుడు నేను ఇచ్చిన హామీ మేరకు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయంతో త్వరలో రంగా జిల్లా తేవడానికి నా వంతు సీఎం దృష్టిలో పెట్టి సాధిస్తామని, రంగా వ్యక్తి కాదు శక్తి అని ఆనాడు సామాజిక సృహతో కుల మతాలకు అతీతంగా సామజిక న్యాయం చేసి, ప్రతి సామాన్యులు కి అండగా ఉన్న మహా నాయకుడు ఆయన కు శిష్యుడుగా ఉన్న మాకు గర్వ కారణం అని రంగా స్ఫూర్తి తో చంద్రబాబు నాయుడు విజన్ తో పని చేస్తున్నానని కార్యకర్తలుకు అండగా ఉంటానని అన్నారు. ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు బేతు రామమోహనరావు మాట్లాడుతూ ఆనాడు రంగన్న ఈనాడు ఉమన్న అందరికి కుల మతాలకు అతీతంగా అందరికి అండగా ఉన్నారని రానున్న రోజులలో మంత్రిగా చూడాలని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో మేడా శ్రీనివాస్, లాము జైబాబు, నెలిబండ్ల బాల, వన్నెంరెడ్డి రాధా కృష్ణ, చలమలశెట్టి శ్రీనివాస్, భూపతి మహేష్, మాలిన్ బాషా,మసాబత్తుల శ్రీనివాస్, గిద్దా శ్రీను, వేల్పూరి, ఉమ్మడి శెట్టి కృష్ణమూర్తి, పెద్దలు, రాధా రంగా మిత్ర మండలి నేతలు, రంగా అభిమానులు, బొండా అభిమానులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

భవాని దీక్షవిరమణ సందర్భంగా సహకరించిన వారికి అభినందనలు...

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : భవాని దీక్ష విరమణ సందర్భంగా అన్ని విధములుగా సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల వారికి స్వచ్ఛంద సంస్థల వారికి, మీడియా ప్రతినిధులు, ప్రజలకు, పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఐ.పి.ఎస్. హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.విజయవాడ నగరంలో జరిగిన భవాని దీక్షల విరమణ ముగింపు సందర్భంగా గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం నందు ఇతర జిల్లాల నుండి భవాని దీక్ష విరమణ బందోబస్త్ నిర్వహించడానికి వచ్చిన పోలీస్ అధికారులతో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ...

ఈ భవాని దీక్షలు విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ కమీషనర్‌కి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేసారు. ఈ భవాని దీక్ష యాప్ వలన సూదూర ప్రాంతాల నుండి వచ్చిన భవాని భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అమ్మవారి దర్శనం ముగించుకుని విరుముడిని సమర్పించుకున్నారు. ఈసారి ఎటువంటి చిన్న సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం ముగిసిందని, భవాని దీక్ష విరమణ బందొబస్త్‌కు వచ్చిన అధికారులందరికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... ఈ సారి భవాని దీక్షల కార్యక్రమం విజయవంతంఅవడానికి ముఖ్య కారణం హెూల్డింగ్ ఏరియా, ఈవో కి మనం ఏది అయితే చెప్పామో దానికంటే బాగా హెూల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేసారు కావున టెంపుల్ ఈ.ఓ.ని అధికారులను అభినందిస్తున్నాను, అదేవిధంగా ఈ క్రమంలో భవాని దీక్ష యాప్, చైల్డ్ మానిటరింగ్ సిస్టం యాప్, అస్త్రం మొదలైన యాప్‌ల ద్వారా మానిటరింగ్ చేయడం వలన మరియు దర్శనాలను కొంచెం త్వరితగతిన ప్రారంబించడం వలన ఎక్కడా భవానీలు ఆగకుండా దర్శనం చేసుకున్నారు. ఈసారి కొత్తగా గిరిప్రధక్షణ అనంతరం రథం సెంటర్ నుండి వినాయక టెంపుల్‌కు వచ్చి క్యూలైన్ లో కలవాలి కాని ఈ సారి రథం సెంటర్ వద్ద ఓపెన్ చేసి క్యూలైన్‌లలోకి పంపడం వలన ఇంకా చాలా వరకు భక్తుల రద్దీ అనేది ఎక్కడా కనిపించలేదు. కమాండ్ కంట్రోల్‌లో అన్ని శాఖల సిబ్బంది అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వలన చాల విజయవంతం అయ్యింది. ఈ ఐదు రోజుల జరిగిన భవాని దీక్ష విరమణ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా నగర ప్రజలకు ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ, ఎక్కడా కూడా దొంగతనాలు జరుగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలకు అస్కారం లేకుండా అంకిత భావంతో, బాధ్యతగా విధులు నిర్వహించి, భవానిదీక్ష విరమణ కార్యక్రమానికి విజయ వంతంగా నిర్వహించుటలో తోడ్పాటు నందించిన దేవాదాయశాఖ, రెవిన్యూ, వివిధ ప్రభుత్వ శాఖలవారికి మరియు ప్రజా ప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థల వారికి, భవానీ భక్తులకు, మీడియా ప్రతినిధులకు మరియు అన్ని విభాగాల వారికి, వివిధ జిల్లాల నుండి వచ్చిన పోలీస్ అధికారులకు, లోకల్ పోలీసు అధికారులు మరియు సిబ్బందికి హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం ఇతర జిల్లాల నుండి భవాని దీక్ష విరమణ బందోబస్త్ నిర్వహించడానికి వచ్చిన పోలీస్ అధికారులకు మరియు లోకల్ అధికారులకు నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఐ.పి.ఎస్. శ్రీ కనకదుర్గ అమ్మవారి శేష వస్త్రం, ఫోటో మరియు లడ్డు ప్రసాదం అందించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, ఐ.పి.ఎస్., డి.సి.పి.లు గౌతమీ షాలి ఐ.పి.ఎస్., తిరుమలేశ్వరరెడ్డి ఐ.పి.ఎస్., ఉమామహేశ్వర రాజు ఐ.పి.ఎస్.,ఎ.బీ.టి.ఎస్.ఉదయరాణి ఐ.పి.ఎస్., కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ట్రైనీ ఐ.పి.ఎస్. మనీషా, ఏ.డి.సి.పి. గుణ్ణం రామకృష్ణ, ఏ.వి..ఎల్ ప్రసన్నకుమార్, టెంపుల్ ఈఓ కె.ఎస్.రామారావు, బందొబస్త్‌కు వచ్చిన ఇతర ఏ.డి.సి.పి.లు, ఏ.సి.సి.లు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది...

గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : రోజు రోజుకి పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకు కెఓపి ఫౌండేషన్ కృషి అభినందనీయమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ అన్నారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో కెఓపి ఫౌండేషన్ వారు ఈ–వ్యర్థాల నిర్వహణపై రూపొందించిన వాల్ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 28న రత్నటాటా జయంతి సందర్భంగా కెఓపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ లోని క్రోమా షోరూమ్ లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అందిస్తే వారి పేరుతో ఒక మొక్కను నాటి, ఈ–సర్టిఫికెట్ అందిస్తారన్నారు. ఈ–వ్యర్థాల నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, కనుక నగర ప్రజలు తమ ఇంటిలోని వినియోగంలో లేని మొబైల్స్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అందించి పర్యావరణ పరిరక్షణలో భాగాస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కెఓపి ఫౌండేషన్ చైర్మన్ బి.నిశ్చల్, గుంటూరు రౌండ్ టేబుల్ 86 సభ్యులు జె.రాము, ఏ.రాకేష్, ఏ.వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాకాని వెంకటరత్నం సేవలు చిరస్మరణీయం...

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : జిల్లాలో విద్య, వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగ అభివృద్ధిలో కాకాని వెంకటరత్నం సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర ఉద్యమ సారథి, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా బుదవారం బెంజిసర్కిల్‌లో ఆయన విగ్రహానికి పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రాను ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలని దెబ్బయ్యవ దశకంలోనే కాకాని డిమాండ్ చేశారని, అప్పుడే అలా జరిగితే ఇప్పటికి రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు జిల్లాలో 9 పాఠశాలలు మాత్రమే ఉండేవని, వెంకటరత్నం మంత్రి అయిన తర్వాత 180 పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బెంజిసర్కిల్‌కు కాకాని సర్కిల్ నామకరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని మాట్లాడుతూ కాకాని ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం కలపాల సూర్యప్రకాశరావు జీవిత అనుభవాల పుస్తకాన్ని ఆయన కుమారుడు వినయ్‌సాగర్ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముసునూరి రత్నబోస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (న్యూఢిల్లీ) చైర్మన్ నాగులపల్లి భాస్కరరావు, కలపాల వినయ్‌సాగర్, గోగినేని ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై మరియు పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల విషయంపై విస్తృతంగా తనిఖీలు...

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణం, రోడ్డు ప్రమాదాల నివారణ అదే విధంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతపై మరియు వాహనాధారులలో హెల్మెట్ పై అవగాహన కల్పించేందుకు నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి కృష్ణమూర్తి నాయుడు పర్యవేక్షణలో ట్రాఫిక్ మరియు లా & ఆర్డర్ పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కలిసి నగరంలోని అన్ని ముఖ్య ప్రదేశాలలో వాహనదారులపి విస్తృతంగా తనిఖీలను నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో హెల్మెట్ ధరించని వాహనదారులను హెల్మెట్ వలన ఉపయోగాలను గురించి అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న జరిమానాలను వెంటనే చెల్లించాలని, మీ ఫోన్‌లోనే జరిమానాలు చెల్లించవచ్చు అని తెలియజేస్తూ హెల్మెట్ పెట్టుకోకపోతే జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలియజేసారు. ఈ రోజు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ ద్వారా పెండింగ్ చలానాలు, హెల్మెట్ ధరించని 2657 మంది వ్యక్తుల వద్ద నుండి 9,91,265/– రుసుము కలెక్ట్ చేయడం జరిగింది. పెండింగ్ చలాన్‌లను https://echallan.parivahan.gov.in/index/accused-challan లింక్ ద్వారా చెల్లించవచ్చు మరియు పెండింగ్ చలానాలు ఉన్న అందరికి మెసేజ్‌లను పంపడం జరిగింది. ఆ మెసేజ్‌లలో ఉన్న లింక్ ఓపెన్ చేసి అయినా కట్టచ్చు. అదే విధంగా అన్ని పోలీస్ స్టేషన్స్ నందు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగింది. వాహనదారులు తమకు విధించిన చలాన్‌లను 90 రోజులలో చెల్లించని యెడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో సచివాలయ మహిళా పోలీస్ సిబ్బందితో హెల్మెట్ వలన ఉపయోగాల గురించి మరియు పెండింగ్ చలానాలను వారి వారి ఫోన్ల ద్వారా చెల్లించే విధానంపై అవగాహన కల్పించడం జరుగుతుంది. అదేవిధంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిదిలో మైక్ అనౌన్సుమెంటు చేయించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలకంగా వ్యవహరించి అత్యధిక చలానాలను వసూలు చేసిన భవానిపురం ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, అజిత్ సింగ్ నగర్ ఇన్స్పెక్టర్ బి.హెచ్ వెంకటేశ్వర్లుని, అజిత్ నగర్ పి.ఎస్.కు చెందిన పి.గాయత్రి మరియు కృష్ణలంక పి.ఎస్.కు చెందిన ఎం.రాజేశ్వరిలను పోలీస్ కమీషనర్ అభినందించారు. కావున మోటార్ సైకిల్ వాహనాధారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనదారులందరు రహదారి భద్రత నియమాలు పాటించి పోలీస్ వారికి సహకరిస్తారని ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు, ఐ.పి.ఎస్. కోరారు.

పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి వంగవీటి మోహన రంగా

-వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : పేద ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప నాయకులు వంగవీటి మోహనరంగా అని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైసీపీ కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం వంగవీటి మోహనరంగా అని ఈ సందర్భంగా మల్లాది విష్ణు కొనియాడారు. అధిష్టానం నిర్ణయాన్ని తూచా తప్పకుండా పాటించేవారని.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల తరపున నిలబడే నేతగా చెప్పుకొచ్చారు. గాంధీనగర్ సబ్ జైలులో ఉండి కూడా కృష్ణలంక డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందిన వ్యక్తి విజయవాడ చరిత్రలో ఒక్క రంగా గారేనని వ్యాఖ్యానించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో తొలిసారి అసెంబ్లీకి ఎన్నికై.. నగర ప్రజలకు విశేష సేవలందించారన్నారు. భారీవర్షాలు, వరదలకు నగరంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురైన సమయంలో దగ్గరుండి బాధితులను ఆదుకున్నారన్నారు. అటువంటి నేత గూర్చి ఎంత తెలుసుకున్నా.. తెలుసుకోవలసింది ఇంకా మిగిలే ఉంటుందన్నారు. రంగా లాంటి నేతలు ఇద్దరు ఉంటే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మార్చివేయవచ్చని ఆనాడు కోన ప్రభాకరరావు అన్న మాటలు అక్షర సత్యమని మల్లాది విష్ణు అన్నారు. రాజకీయాలలోకి రావాలనుకునే యువతకు ఆయనొక రోల్ మోడల్‌గా అభివర్ణించారు.

విజయవాడను పోరాటాల గడ్డగా మార్చిన నేత

1983 నుంచి 1989 వరకు నాటి తెలుగుదేశం ప్రభుత్వ నిరంకుశ విధానాలపై వీఎం రంగా చేసిన అలుపెరుగని పోరాటాలను ఈ సందర్భంగా మల్లాది విష్ణు గుర్తుచేసుకున్నారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పోలీస్ బిల్లు తీసుకొచ్చిన సమయంలో.. పేదల తరపున పోరాటాలు చేసిన ఏకైక నాయకులు రంగా అని చెప్పారు. ఆయన నాయకత్వంలో విజయవాడ నగరం ఉద్యమాలకు వేదికగా మారిందన్నారు.

వీఎం రంగా స్ఫూర్తితో 26 వేల మందికి పట్టాల పంపిణీ

పేద ప్రజల కోసం దివంగత నేత వంగవీటి మోహన రంగా ఆఖరి క్షణం వరకు పోరాటం చేశారని.. ఆయన స్ఫూర్తితో 2019–24 మధ్య కాలంలో 26 వేల మంది పేదలకు ఇంటి స్థలాలపై సర్వ హక్కులు కల్పించేందుకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందన్నారు. జీవో నెం.105 ద్వారా గతంలో పునరావాస లబ్ధిదారులకు కేటాయించిన రాజరాజేశ్వరి పేట, వాంబేకాలనీలోని 2,763 ఇళ్లకు రిజిస్ట్రేషన్లను పూర్తిచేయడం జరిగిందన్నారు. జీవో నెం. 60 ద్వారా 100 గజాల లోపు ఉన్న 115 కుటుంబాలకు ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయడమైందని పేర్కొన్నారు. కస్తూరిభాయిపేట, గిరిపురం పరిధిలోని నిరంభ్యతర ప్రభుత్వ భూముల్లోని ఇళ్ల స్థలాలను రెగ్యులరైజేషన్ చేసి.. 98 మంది లబ్ధిదారులకు హక్కుతో కూడిన పట్టాలు అందజేసినట్లు వివరించారు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత కూటమి నేతలు పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని... వారి మాయలో పడొద్దని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరూ తమ తమ వార్డు సచివాలయాల పరిధిలో వీఆర్వోలను సంప్రదించినట్లయితే.. ఇళ్లను రెగ్యులరైజ్ చేసి హక్కుతో కూడిన పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను సొంత కష్టాలుగా పోరాడి విజయవాడ నగర ప్రజల హృదయాలలో వీఎం రంగా సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారన్నారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు, ఇసరపే దేవి రాజారమేష్, నాయకులు అలంపూర్ విజయ్, హాఫీజుల్లా, గుండె సుందర్ పాల్, యర్రంశెట్టి అంజిబాబు, కాళ్ల ఆదినారాయణ, మేడా రమేష్, తోపుల వరలక్ష్మి, పేరం త్రివేణిరెడ్డి, అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మేదర సురేష్‌కుమార్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రక్షకుడు పుట్టిన దినమే క్రిస్మస్ పర్వదినం. క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని, విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని పాదుగొల్పాలి. ఈ క్రిస్మస్ మానవాళి జీవితాల్లో ప్రేమ, శాంతి నింపాలని డ్రీమ్ ఆర్గన్మైజేషన్ అధ్యక్షుడు, ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్ మేదర సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియచేసారనీ, యేసుక్రీస్తు గొప్ప శాంతి దూత, కరుణామయుడు అని, క్రైస్తవ సోదర సోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహల మధ్య ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. దేవాది దేవుడు, కరుణామయుడు, లోక రక్షకుడు అయిన ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు సమాజంలోని ప్రజల మనగడ, జీవన శైలికి ఎంతో అవసరం అని పేర

ఉత్సాహం...ఉద్వేగం...సీపీఐ శత వసంతం

-రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సీపీఐ శత వార్షికోత్సవాలు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ని స్థాపించి 99 ఏళ్లు పూర్తి చేసుకుని వందో సంవత్సరవంలోకి అడుగుపెట్టింది. ఈ చారిత్రక ఘటంలో పార్టీలోని ప్రతిఒక్కరూ ఉత్సాహం, ఉద్వేగానికి లోనైయ్యారు. తొలుత స్థానిక హనుమాన్‌పేటలోని సీపీఐ 100వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్ వద్ద గురువారం అరుణపతాకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవిష్కరించారు. రెడ్‌షర్ట్ వలంటీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న పార్టీ సీనియర్ నాయకులు చంద్రరాజేశ్వరరావు విగ్రహం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శత వార్షికోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ది విజయవాడ టాక్సీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు కంచర్ల నాగేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాయంత్రం సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్ పార్కులో జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షత జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ 1925 డిసెంబరు 26వ తేదిన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో భారత దేశంలోని మేధావులు, విద్యావేత్తలు, లెనిన్, మార్క్స్ సిద్ధాంతాలపై విశ్వాసం ఉన్న వారు భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐ చేపట్టిన పోరాటంలో భాగంగా 32 మంది ప్రాణాలు అమరులైయ్యారని గుర్తు చేశారు. పార్లమెంటులో హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారని చెప్పారు. అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ ఈ నెల 30న వామపక్ష పార్టీలు నిరసనలు చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు మర్చిపోయారని విమర్శించారు. విశాఖ ఉక్కు గురించి నొరెత్తని చంద్రబాబు మిట్టల్ ఉక్కు గురించి మోదీతో మాట్లాడారని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయటానికి కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ అభివృద్ధిని కాంక్షించే అభ్యుదయ వాదులందరూ వెలుగులోకి వచ్చి కమ్యూనిస్టు పార్టీని స్థాపించటం ద్వారా దేశంలో సాంస్కృతిక మార్పు వచ్చిందన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మికవర్గం హక్కుల కోసం చేస్తున్న ఉద్యమానికి కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ విజయవాడ నగరంలో కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు, తద్వారా జరిగిన అభివృద్ధిని ఆమె వివరించారు. తుమ్మపల్లి కళాక్షేత్రం నుంచి లెనిన్ పార్కు వరకు రెడ్‌షర్ట్ వలంటీర్లు ఎర్రజెండాలు చేబూని కవాతు నిర్వహించారు. తుమ్మలపల్లి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ పార్కు వరకు జరిగిన కవాతును సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్.కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, సీనియర్ నాయకులు వై.చెంచయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అప్సర్, ప్రొఫోసర్ సి.నరసింహారావు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సదానందం, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, వీధి విక్రయదారుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావుల, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్‌తో పాటు సీపీఐ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీఆర్వోలపై పని వత్తిడి తగ్గించాలి... : భూపతిరాజు రవీంద్ర రాజు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సమావేశం జరిగింది. వీఆర్వోలపై అధిక పని వత్తిడి ఉందని, దీనికితోడు ఇతర శాఖ అధికారులు మరిన్ని ఇబ్బందులు సృష్టిస్తుండటంతో వారు మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం దృష్టి సారించి తమ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రవీంద్ర రాజు మాట్లాడుతూ 2021 సంవత్సరం నుంచి వీఆర్వోలు నిర్వహించిన ప్రత్యేక విధులకు రావలసిన బకాయిలు రాకపోవడంతో ఆర్థిక మంత్రి దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లగా రూ.58 కోట్ల బడ్జెట్ విడుదల చేయటం సంతోషించదగిన విషయమని అన్నారు. 2019 నుంచి 2024 వరకు వాలంటీర్ చేసిన పనులన్నీ వీఆర్వోలు చేస్తున్నారని తెలిపారు. ఉదయం ఐదు గంటలకే పింఛన్లు అందజేయాల్సి రావడంతో సచివాలయ సిబ్బందిలోని మహిళలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం సామాజిక పింఛన్లు ఉదయం 10 గంటలకు పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. బయోమెట్రిక్ వేస్తేనే జీతాలు ఇవ్వటమనేది, సచివాలయం వ్యవస్థ వచ్చిన తర్వాత వీఆర్వోలు పనిచేయటం లేదని ఆరోపించడం సరైన విధానాలు కావని అన్నారు. గ్రేడ్ వన్ స్థాయిలో ఉన్న వీఆర్వోలకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం 120 రోజుల్లో భూముల రీ సర్వే చేయాలని మంత్రివర్గంలో ఆమోదించడం సరికాదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల్కైనా ప్రభుత్వ ఉద్యోగస్తులను పట్టించుకోవడం లేదని, ఈ వైఖరి పట్ల ఉద్యోగులలో అసంతృప్తి చాలా ఉందని అన్నారు. వెంటనే డీఏ విడుదల చేయాలని, వీఆర్వో పోస్టులు కూడా భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు మిర్యాల లక్ష్మీనారాయణ, బి.మురళీకృష్ణ, రాధాకృష్ణ, చైతన్య, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ పదవిలో తొలిసారిగా తెలుగు వ్యక్తి

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : భారత వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (IARI) డైరెక్టర్‌గా తొలిసారి ఓ తెలుగు వ్యక్తి నియమితులయ్యారు. ఐఏఆర్ఐ డైరెక్టర్ గా డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు నేడు ఢిల్లీలో బాధ్యతలు చేపట్టారు. చెరుకుమల్లి శ్రీనివాసరావు స్వస్థలం ఉమ్మడి కృష్ణా జిల్లా అనిగండ్లపాడు గ్రామం. ఆయన 1965 అక్టోబరు 4న జన్మించారు. బాపట్ల అగ్రికల్చర్ కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశారు. ఢిల్లీలో అగ్రికల్చరల్ ఎమ్మెస్సీ, పీహెచ్ డీ పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసం అనంతరం పలు పరిశోధన సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్ మెంట్ (నార్మ్) డైరెక్టర్‌గా ఉన్నారు.

వంగవీటి రంగా అందరివాడు... రాధా మాత్రం...!: పోతిన మహేశ్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : వంగవీటి రంగా 36వ వర్ధంతి. ఈ సందర్భంగా విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో రంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. బెజవాడలోని చెరువు సెంటర్ లో ఏర్పాటు చేసిన రంగా వర్ధంతి కార్యక్రమానికి వైసీపీ నేత పోతిన వెంకట మహేశ్ హాజరయ్యారు. రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన... రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వంగవీటి రంగా అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడని, కానీ రాధా మాత్రం ఆయనకు కుటుంబ వారసుడిగానే మిగిలుపోతున్నాడని అన్నారు. రంగా ఆశయాల కోసం రాధా ముందుకురావడంలేదని, కేవలం ఎన్నికల సమయంలోనే రాధా బయటికి వస్తున్నారని వ్యాఖ్యానించారు. "రంగా సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తి... ప్రజా సమస్యలపై, కాపు సమాజ ఇబ్బందులపై మాట్లాడకపోవడం బాధాకరం. రాధా ఆలోచన ఏంటో అర్థం కావడంలేదు. కాపు వర్గం అణచివేతకు గురవుతున్నా స్పందించడం లేదు... కనీసం కాపు రిజర్వేషన్లపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. రంగా విగ్రహాలను ఆవిష్కరిస్తూ ఆయనకు తానే వారసుడ్నని చెప్పుకోవడం తప్ప రాధా చేస్తున్నది ఏమిటి? రంగా వారసులుగా మేం అనేక పోరాటాలు చేశాం... కానీ రాధా మాత్రం బీసీ వర్గాల భవిష్యత్తును నాశనం చేసే వ్యక్తులతో చేతులు కలపడం దురదృష్టకరం. జిల్లాకు రంగా పేరు పెట్టాలని ఒక్క మాట మాట్లాడొచ్చు కదా... కనీసం వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడైనా మాట్లాడకపోతే ఎలా! రాధా పదవి గురించి కాకుండా, ఇకనైనా తన తండ్రి రంగా ఆశయ సాధన కోసం కృషి చేయాలి" అని పోతిన మహేశ్ స్పష్టం చేశారు.

ఇవన్నీ ఇళయరాజా గొప్పతనాలే

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : సంగీత దర్శకుడు ఇళయరాజా గురించి తెలియనివారుండరు. సినిమా సంగీతాన్ని పరుగులు తీయించినవారు ఆయన. అలాంటి ఇళయరాజా గురించి తాజాగా 'తెలుగు వన్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ మాట్లాడారు. "ఇళయరాజా గారి ఫస్టు సినిమా కొన్ని కారణాల వలన మధ్యలో ఆగిపోయింది. ఆ తరువాత కొంతకాలానికి రెండో సినిమా చేసే ఛాన్స్ వచ్చింది. ఆ సినిమా నుంచి ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. నేను ఆయన దగ్గర 30-40 సినిమాల వరకూ పనిచేశాను" అని అన్నారు. "నేను పనిచేసిన సంగీత దర్శకులంతా ఒక ఎత్తు .. ఇళయరాజాగారు ఒక ఎత్తు. వాయిద్యాల పరంగా ఇతర సంగీత దర్శకులు ఉపయోగించే కాంబినేషన్స్ ను ఆయన వాడేవారు కాదు. ఇళయరాజా గారు వన్ మేన్ షో. చాలా ఫాస్టుగా ఆయన కంపోజ్ చేస్తారు. ఉదయం 7 గంటలకు మొదలుపెడితే రాత్రి 9 గంటలలోగా ఒక సినిమాకి సంబంధించిన సగం వర్క్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో సహా పూర్తయ్యేది. మిగతా సగాన్ని మరుసటి రోజు చేసేవారు. అందువల్లనే ఆయన 1700 సినిమాల వరకూ చేయగలిగారు" అని చెప్పారు. "వచ్చిన సినిమాను వచ్చినట్టుగానే అప్పటికప్పుడు చేసేవారు. అలా ఆయన చేసిన సినిమాలు కొన్ని వందలు ఉన్నాయి. ఆయన సంగీతం కారణంగా టాప్ హీరోలు అయినవాళ్లు చాలామంది ఉన్నారు. ఏ వాయిద్యాన్ని ఎక్కడ వాడాలో .. ఎంతవరకూ వాడాలో అనే ఒక ధర్మం ఆయనకి బాగా తెలుసు. ఆయన ఉపయోగించడం వల్లనే కొన్ని వాయిద్యాలకు ఒక ప్రత్యేకత వచ్చిందనేది వాస్తవం. నాతో పాటు చాలామంది సంగీత దర్శకులకు ఆయనే స్ఫూర్తి" అని చెప్పారు.

నన్ను నిలబెట్టినవి ఆ రెండు సినిమాలే..

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : నాటక రంగం నుంచి సినిమా ఇండస్ట్రీకి వచ్చినవారిలో తనికెళ్ల భరణి ఒకరు. ఇంటర్వ్యూలో భరణి మాట్లాడుతూ... "నాటకాలు రాస్తూ వెళుతున్న నాకు 'కంచు కవచం' సినిమాతో రచయితగా ఛాన్స్ వచ్చింది. ఆ తరువాత 'పట్నం పిల్ల పల్లెటూరి చిన్నోడు' సినిమా కోసం వెళ్లాను... వచ్చేశాను" అని అన్నారు. "ఆ తరువాత చెన్నై వెళ్లినప్పుడు దర్శకుడు వంశీ గారికి నన్ను రాళ్లపల్లిగారు పరిచయం చేశారు. కామెడీ రాయాలని చెబుతూ, వంశీగారు నాకు ఏడు సీన్లు ఇచ్చారు. ఆ సాయంత్రానికే రాసుకుని తీసుకుని వెళితే వంశీ ఆశ్చర్యపోయాడు. నేను రాసిన సీన్లు చదివిన తరువాత, ఆయన అదే పనిగా నవ్వాడు. 'నాకు కావలసిన రైటర్ దొరికేశాడు... నెక్స్ట్ సినిమా మీరే రాస్తున్నారు' అని అన్నాడు. ఆ సినిమానే 'లేడీస్ టైలర్'."ఆ సినిమా తరువాత ఒక రచయితగా నేను వెనుదిరిగి చూసుకోలేదు. 'కనకమహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్... చెట్టుకింద ప్లీడర్... ఇలా ఓ అరడజను సినిమాల వరకూ నేనే రాశాను.

'న్యూ ఇయర్ విషెస్' పేరుతో నయా మోసం..

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. న్యూ ఇయర్ వేళ సరికొత్త మోసానికి తెరతీశారు. విషెస్ చెబుతూ అందినకాడికి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. న్యూ ఇయర్ శుభాకాంక్షలు వచ్చాయి కదా అని వాటిపై క్లిక్ చేస్తే మీ బ్యాంక్ ఖాతా గుల్ల కావడం ఖాయం. కాబట్టి అపరిచిత వ్యక్తుల నుంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు, డిస్కౌంట్ల పేరిట లింకులు వస్తే తొందరపడొద్దు. వాటిని క్లిక్ చేసి జేబులు గుల్ల చేసుకోవద్దు. న్యూఇయర్ విషెస్, డిస్కౌంట్ కూపన్లు, భారీ ఆఫర్లు, ఈవెంట్ పాస్‌ల పేరుతో బోగస్ లింకులను పంపి కేటుగాళ్లు మోసానికి పాల్పడుతున్నట్టు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. నేరగాళ్లు పంపించే లింకులను క్లిక్ చేస్తే ఫోన్ హ్యాక్ అవుతుందని, ఆ మెసేజ్‌ను వేరేవారికి ఫార్వార్డ్ చేస్తే వారు కూడా నేరగాళ్ల బారినపడతారని చెబుతున్నారు. బాధితులకు ఎలాంటి అనుమానం రాకుండా నేరగాళ్లు ప్రముఖ సంస్థల పేరుతో ఈవెంట్ పాస్‌లు పంపుతున్నారు. వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా తక్కువ ధరకే ఈవెంట్ పాస్ పొందవచ్చని ఊరిస్తారు. యూజర్లు ఆవేశపడి లింక్‌పై క్లిక్ చేస్తే వెంటనే ఫోన్ వారి నియంత్రణలోకి వెళ్లిపోతుంది. ఆ తర్వాత బ్యాంకు ఖాతాలోని సొమ్ము మాయమవుతుంది. ఆ తర్వాత కూడా నేరగాళ్లు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి విషెస్ వస్తే వాటిపై క్లిక్ చేయవద్దని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఏపీకి 5 వేల బస్సులు

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్‌లో ఉంటూ సంక్రాంతి పండుగకు ఊరెళ్లాలని ప్లాన్ చేసుకుంటున్న వారికి ఇది శుభవార్తే. నగరం నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే సంక్రాంతి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ఆర్టీసీ ఏకంగా 5 వేల ప్రత్యేక బస్సులు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు నేడు ప్రకటించనున్నారు. ఏపీతోపాటు తెలంగాణలోని పలు జిల్లాలకు కూడా ఈ బస్సులు నడవనున్నాయి. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం యథావిధిగా కొనసాగుతుంది. అయితే, ఎప్పట్లానే అది పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రోఎక్స్‌ప్రెస్ బస్సులకే పరిమితం. అయితే, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకు మాత్రమే జీరో టికెట్ వర్తిస్తుంది. ఆ తర్వాత మాత్రం టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జనవరి తొలి వారం నుంచి 17వ తేదీ వరకు పది రోజులపాటు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి.

ఏపీఎస్ ఆర్టీసీ కూడా.. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ఏపీఎస్ ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు ప్రకటించింది. హైదరాబాద్ నుంచి 2,400 ప్రత్యేక బస్సులు నడపనుంది. జనవరి 9 నుంచి 13 వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. వీటిని సాధారణ చార్జీలతోనే నడపనున్నట్టు అధికారులు తెలిపారు.

రోహిత్ శర్మ రిటైర్‌మెంట్?..

స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : టెస్ట్ ఫార్మాట్ క్రికెట్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ నిరాశపరిచాడు. కేవలం 3 పరుగులకే తను ఔట్ అయ్యాడు. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 22 పరుగులు మాత్రమే సాధించాడు. దీంతో, రోహిత్ శర్మ క్రికెట్ భవిష్యత్తుపై మరోసారి చర్చలు మొదలయ్యాయి. అతడి రిటైర్‌మెంట్‌పై ఒక్కసారిగా ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఆస్ట్రేలియాతో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్ తర్వాత రోహిత్ శర్మ టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్ అయ్యే అవకాశం ఉందని పీటీఐ పేర్కొంది. బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రస్తుతం మెల్‌బోర్న్‌లోనే ఉన్నారని, రోహిత్ భవిష్యత్తు గురించి చర్చించే ఛాన్స్ ఉందని వెల్లడించింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరుకోవడంలో టీమిండియా విఫలమైతే టెస్టు క్రికెట్‌కు హిట్‌మ్యాన్ వీడ్కోలు పలకడం దాదాపు ఖాయమని తెలిపింది. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య 5 మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు ప్రస్తుతం 1-1తో సమంగా ఉన్నాయి. దీంతో, చివరి రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా మారాయి. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోవాలంటే ఈ సిరీస్‌ను తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. ఇదిలావుంచితే, రోహిత్ శర్మ వరుస వైఫల్యాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో అతడు బద్ధకంగా కనిపిస్తున్నాడని, మైదానంలో చురుకుగా కదలలేకపోతున్నాడని, వయసు ప్రభావం కావొచ్చంటూ దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ విశ్లేషించారు. రోహిత్ శర్మ ఫుట్‌వర్క్‌లో లోపాలను ఆయన ఎత్తి చూపించారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అతడి లోపాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషించారు.

'మురా' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మలయాళంలో ఈ మధ్య కాలంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ సినిమాలలో 'మురా' ఒకటి. రియా శిబూ నిర్మించిన ఈ సినిమాకి, ముహమ్మద్ ముస్తఫా దర్శకత్వం వహించాడు. నవంబర్ 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, అక్కడ సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ నెల 25వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కి వచ్చింది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. కథ: ఆనంద్ (హృదు హరున్) షాజీ (జోబిన్ దాస్) మను (యదుకృష్ణ) మనఫ్ (అనుజీత్) ఈ నలుగురూ మంచి స్నేహితులు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళుతూ ఉంటారు .. కలిసే తిరుగుతూ ఉంటారు. ఆ గ్రూప్ లో ఆనంద్ మాత్రమే మిడిల్ క్లాస్ కుర్రాడు. మిగతా వాళ్లంతా దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. నలుగురికీ కూడా చదువు పెద్దగా వంటబట్టదు. ఖర్చుల కోసం లోకల్ రౌడీలతో చేతులు కలుపుతారు. లోకల్ రౌడీ లీడర్ వాళ్లను 'అనీ' (సూరజ్ వెంజరమూడు)కు పరిచయం చేస్తాడు. గ్యాంగ్ స్టర్ రమాదేవి (మాలా పార్వతి) దగ్గర ప్రధానమైన అనుచరుడిగా అతను పనిచేస్తూ ఉంటాడు. ఈ నలుగురు కుర్రాళ్లకు భయమనేది తెలియదనీ, అప్పగించిన పనిని ధైర్యంగా పూర్తి చేస్తారనే విషయాన్ని అనీ గమనిస్తాడు. తమ గ్రూప్ లో అలాంటి కుర్రాళ్లు ఉండాలని భావించి, వాళ్లకు అడ్వాన్స్ ఇస్తాడు. ఇక అప్పటి నుంచి నలుగురు కుర్రాళ్లు చెలరేగిపోతారు. ఒక సీక్రెట్ ప్లేస్ లో పెద్దమొత్తంలో బ్లాక్ మనీ ఉంటుంది. మధురై ప్రాంతంలో దాచబడిన ఆ బ్లాక్ మనీని తీసుకొచ్చే బాధ్యతను ఆ నలుగురు కుర్రాళ్లకు అప్పగించాలని అనీ అనుకుంటాడు. వాళ్లపై తనకి పూర్తి నమ్మకం ఉందని రమాదేవిని ఒప్పిస్తాడు. ఈ నలుగురు కుర్రాళ్లు, మధురైకి చెందిన లోకల్ కుర్రాళ్లను ఇద్దరినీ వెంటబెట్టుకుని, బ్లాక్ మనీ దాచిన ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ ఏం జరుగుతుంది? ఊహించని ఆ సంఘటనతో వాళ్ల జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? అనేది కథ. విశ్లేషణ: సురేశ్ బాబు అందించిన కథ ఇది. నలుగురు కుర్రాళ్లు .. అందరూ 20 .. 21 సంవత్సరాల లోపువారే. ఇంట్లోవాళ్లు చదువుకోమన్నా .. ఏదైనా పని చూసుకుకోమన్నా పెద్దగా పట్టించుకోరు. కుటుంబ బరువు బాధ్యతలు ఎంతమాత్రం పట్టనివారే. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కులాసాగా బైక్ లపై తిరిగేస్తూ ఉంటారు. అలాంటి కుర్రాళ్లు ఖర్చులకి అవసరమైన డబ్బు కోసం రౌడీ గ్యాంగ్ తో చేతులు కలపడంతో ఈ కథ మొదలవుతుంది. దర్శకుడు ఈ నలుగురు స్నేహితుల పాత్రలను డిజైన్ చేయడంలోనే ఎక్కువ మార్కులు కొట్టేశాడు. ఈ నాలుగు పాత్రలు ఆదర్శవంతమైనవి కాకపోయినా, ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండటం .. స్నేహానికి కట్టుబడి ఉండటం ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రధానమైన అంశంగా కనిపిస్తుంది. ఇక్కడే ఈ నలుగురికి ఆడియన్స్ వైపు నుంచి మద్దతు లభిస్తుంది. వాళ్లతో కలిసి ఎమోషనల్ గా ట్రావెల్ అయ్యేలా చేస్తుంది. ఈ కుర్రాళ్లు గ్యాంగ్ స్టర్ కోసం పనిచేయడం ఫస్టు పార్టుగా .. గ్యాంగ్ స్టర్ తోనే తలపడటం సెకండ్ పార్టుగా తెరపైకి వస్తుంది. అందుకు సంబంధించిన సన్నివేశాలు సహజత్వానికి చాలా దగ్గరగా .. ఉత్కంఠ భరితంగా సాగుతాయి. యాక్షన్ .. ఎమోషన్ అనేవి సమపాళ్లలో కుదురుకున్నాయి. ఎక్కడా సినిమాటిక్ గా ఏదీ అనిపించదు. మొదటి నుంచి చివరివరకూ ప్రేక్షకులను కదలకుండా కూర్చోబెట్టడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడని చెప్పాలి. ప్రధానమైన పాత్రలను పోషించిన నలుగురు కుర్రాళ్లు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. అడ్డదారి తొక్కిన ఆకతాయిల బిహేవియర్ ఎలా ఉంటుందో .. అలాగే చేశారు. వాళ్లు నటిస్తున్నట్టుగా అనిపించదు. అంత గొప్ప అవుట్ పుట్ ఇచ్చారు. ఇక సూరజ్ వెంజరమూడు .. మాలా పార్వతి యాక్షన్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పని లేదు. ఫాజిల్ నజర్ ఫొటోగ్రఫీ బాగుంది. యాక్షన్ .. ఛేజింగ్ దృశ్యాలను చిత్రీకరించిన తీరు ఆకట్టుకుంటుంది. క్రిస్టీ జోబీ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలం అని చెప్పాలి. ఆయన అందించిన థీమ్ మ్యూజిక్ హైలైట్ గా నిలిచింది అనడంలో అతిశయోక్తి లేదు. చమన్ చాకో ఎడిటింగ్ మెప్పిస్తుంది. ఎక్కడా అనవసరమైన సీన్ అనేది కనిపించదు. ఈ సినిమాలో ఒకటి రెండు చోట్ల హింస కనిపిస్తుంది .. అది కూడా చివరిలో. అభ్యంతరకరమైన సన్నివేశాలు .. సంభాషణలు మాత్రం లేవు. జీవితం ఎంతో అందమైంది .. సరదాల కోసం .. సంతోషాల కోసం .. తాత్కాలికమైన ఆనందాల కోసం అడ్డదారిలో వెళ్లకూడదు. ఒకవేళ అలా చేస్తే ఆ జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతాయి. స్నేహం నీ ఆయుధం అయినప్పుడు దానిని మంచి కోసం ఉపయోగించు అనే సందేశం ఈ కథలో కనిపిస్తుంది.

హైందవ శంఖారావానికి తరలిరండి...

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయం వద్ద గల కేసరపల్లి గ్రామంలో జనవరి 5వ తేదీన జరుగబోయే హైందవ శంఖారావం మహాసభకు రాజకీయ పార్టీల, కులాలకు అతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి హిందూ బందువులు అంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వాస్తు సిద్ధాంతి మామిడి సత్య నారాయణ పిలుపు నిచ్చారు. మంగళవారం గాంధీనగరలోని ప్రెస్‌క్లబ్లో శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించ